క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి


ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న నెల్లూరు రీజనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం నాయుడుపేట ఆర్టీసీ బస్టాండును తనిఖీ చేశారు. ప్రయాణికులకు కనీస సౌకర్యా లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంగణంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంపై మండి పడ్డారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులకు వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, రాజశేఖర్ రెడ్డి, చిగురాకుల సురేంద్ర, పొంగూరు కృష్ణారెడ్డి, వినుకొండ ధనుంజయ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు చెరువులో ఆక్రమణలు తొలగించాలని పలువురు రైతులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ రామయ్యకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చెరువు భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తెలిపారు. గతంలో చెరువులో పెరిగే గడ్డిని పశువులు మేతకు ఉపయోగించుకునేవారమని తెలిపారు. చెరువును ఆక్రమించుకుని పంటలు సాగు చేయడంతో పశువులకు మేతతోపాటు తాగేందుకు నీరు కూడా లేదని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కోట: కోట ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన దిలీప్‌కుమార్‌నాయక్‌ను సోమవారం ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్పీటీసీ కోటయ్య సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరినీ కలుపుకుని పోతానని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోటారెడ్డి, పుట్టా నారాయణ, నాగూర్‌యాదవ్ పాల్గొన్నారు.

పింక్ బస్సులో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దక్కిలి: మహిళల్లో వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించేందుకు పింక్ బస్సుల్లో ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. తిరుపతి స్విమ్స్ వైద్యులు సోమవారం మాధవయ్యపాళెం, తీర్థంపాడు సచివాలయాల పరిధి లోని గ్రామాల్లోని ప్రజలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ క్యా న్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, హరిత, సర్పంచ్ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రామనారాయణ, కార్తీక్, ఏఎన్‌ఎంలుజ్యోతి,నరసమ్మ పాల్గొన్నారు.

నర్సుల సేవలు అనిర్వచనీయం


కేక్ కట్ చేస్తున్న వైద్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు

చిల్లకూరు : వైద్యం అందించడంలో నర్సుల సేవలు అనిర్వచనీయమని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా తెలిపారు. నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏరియా ఆస్పత్రి నర్సులతోపాటు మైథిలీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో కలిసి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించారని గుర్తు చేశారు. కొంత మంది చంటి బిడ్డలను వదలి ఆస్పత్రిలోనే ఎక్కువ సేపు గడిపారని వివరించారు. నర్సింగ్ కళాశాల యాజమాన్యం డాక్టర్ మైథిలి, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మురళీనాయక్‌కు నివాళి

చిట్టమూరు: పాకిస్తాన్ సైనికుల కాల్పుల్లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్‌కు సోమవారం తాడిమేడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


భక్తులకు మంగళసూత్రాలు చూపుతున్న వేదపండితులు

కల్యాణం.. కమనీయం

- శాస్త్రోక్తంగా నృసింహుడి కల్యాణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఒక్కటైన పలు జంటలు

రాపూరు: పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ దేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. 9.50 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి కల్యాణ మండపానికి తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. ముందుగా విష్వక్సేన పూజ చేశారు. తదుపరి వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు.

శ్రీవారి కల్యాణంలో ఒక్కటైన జంటలు

శ్రీవారి కల్యాణం జరిగే ముహూర్తానికి పలు జంటలు ఒక్కటయ్యాయి. స్వామివారి కల్యాణ ముహూర్తం రోజు పెళ్లి చేసుకుంటే దాంపత్యం బాగుంటుందని భక్తుల నమ్మకం. స్వామి కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారికి రూ.1,65,504 చదివింపులు అందజేశారు.


ముత్యాల తలంబ్రాలను చూపుతున్న అర్చకులు


అంగరంగ వైభవంగా పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం, (ఇన్‌సెట్) విశేషాలంకరణలో స్వామి

దేదీప్యమానంగా రథోత్సవం

పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు ఉభయ నాంచారులతో కలిసి రథంపై కొలువుదీరి కోన తిరువీధుల్లో ఊరేగారు. భక్తుల గోవింద నామస్మరణతో రథాన్ని లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా గజ వాహనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి రాత్రి 10 గంటలకు గజ వాహనంపై కోన మాడవీధుల్లో విహరించారు. రాత్రి 12 గంటకు ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్నుతిరుపాల్‌రెడ్డి, సోమయ్య, అర్చకులు పెంచలయ్యస్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, తదుపరి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వ వాహన సేవ, 11 గంటలకు ధ్వజావరోహణం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

చిల్లకూరు : కలవకొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ అమ్మవార్లను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారి తలంబ్రాలకు యువతీ, యువకులు పోటీ పడ్డారు. కల్యాణానికి ఉభయ కర్తలుగా గ్రామానికి చెందిన కందల సుధాకర్, నీజమ్మ వ్యవహరించారు. ముత్యాల తలంబ్రాలను కాకువారిపాళెంకు చెందిన రావుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అందజేశారు. అనిశెట్టి సుబ్రహ్మణ్యంశెట్టి, క్రిష్ణయ్యశెట్టి, సుభోష్‌శెట్టి, గురునాథం, అన్నాడి లోకనాథం మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం గజవాహన సేవకు ఉభయకర్తలుగా ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వరదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, గిరిజ, తిప్పగుంటపాళెం గ్రామానికి చెందిన ఎల్లంటి ప్రభాకర్‌రెడ్డి సులోచనమ్మ వ్యవహరించారు.


కల్యాణంలో మంగళసూత్రాలను చూపిస్తున్న వేద పండితులు

పేదలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు

చిల్లకూరు : పేదలను ఇబ్బంది పెట్టే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని పాశం సునీల్‌కుమార్ హెచ్చరించారు. ఆయన సోమవారం గూడూరు రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు మాట్లాడుతూ వీఆర్వోలు లంచం అడుగుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఉద్యోగులు గూడూరు నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పేదలను ఇబ్బంది పెట్టినట్లు మరోసారి ఫిర్యాదులు అందితే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పేదలు సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ను ఆదేశించారు. నాన్చుడి ధోరణితో వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు.


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గిరిజన కాలనీలో చర్చి ప్రారంభం

వాకాడు : మండలంలోని వాయలపాళెం గిరిజన కాలనీలో నిర్మించిన చర్చిని సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి తన సొంత నిధులతో గిరిజన కాలనీలో చర్చి నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘకాపరి ఎస్ ప్రశాంత్‌బాబు, నేదురుమల్లి శ్రీధర్‌రెడ్డి, గౌరవ్‌రెడ్డి, కోదండరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చర్చిని ప్రారంభిస్తున్న ఉదయ్‌శేఖర్‌రెడ్డి

హనుమంతుడిపై కరిమాణిక్య స్వామి విహారం


హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామి


స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులోవున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీ వేద పండితులు చప్పర ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యా హ్నం స్నపన తిరుమంజనం చేపట్టారు. తదుపరి స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ చేపట్టారు. మంగళవారం ఉదయం ఆలయంలో ద్వార దర్శనం పూజలు నిర్వహిస్తారు. రాత్రి గరుడ వాహనం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్, ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్ రెడ్డి, పసల గంగాప్రసాద్, నరసారెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

నాయుడుపేట టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన నివాసం వద్ద నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 తరగతిలో 1, 2, 3 స్థానాల్లో నిలిచిన 20 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎంలను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

బస్టాండులో అనాథ మహిళ మృతి

తడ: స్థానిక బస్టాండు సెంటర్‌లో సోమవారం తెల్లవారుజామున అనాథ మహిళ(60) మృతిచెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆమె బజారులో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తోందని, ఆదివారం రాత్రి తడ బస్టాండు సెంటర్‌లో ఫుట్‌పాత్‌పై నిద్రించినట్టు స్థానికులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున షాపు తెరిచేందుకు వచ్చిన యజమాని నిద్రలేపాడు. ఆమె ఎంతకూ లేవకపోవడంతో మృతి చెందినట్టు ధ్రువీకరించుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ కొండపనాయుడు ఆదేశాల మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలికి ఎవరూ లేరని తేలడంతో పంచాయతీ సిబ్బంది సహకారంతో ఖననం చేశారు.


మహిళ వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గొడవలకు దిగితే కేసులు నమోదు

పెళ్లకూరు: గ్రామాల్లోని ప్రజలు ఐకమత్యంగా ఉండాలని, గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ కె.నాగరాజు తెలిపారు. ఆయన సోమవారం రావులపాడు వాసులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆరుబయట మద్యం సేవించడం మానుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కేవీ నాయుడు, బాలచంద్రనాయుడు, మహేష్‌నాయుడు, మురళీనాయుడు, గురవయ్య, వెంకటరత్నం, రమణయ్య పాల్గొన్నారు.


రావులపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగరాజు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

చిట్టమూరు : పురుగు మందులు, రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు. పశువుల ఎరువు, వేపాకుల కషాయం పిచికారీ చేసి కూరగాయలు పండించినట్టు తెలిపారు. ఇంటి పరిసరాల్లో కూరగాయలు పండించుకునేలా కిచెన్ గార్డెన్స్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ నిరంజన్, ఏఎస్‌వో మస్తాన్‌బాబు, సాధికార సంస్థ మండల యూనిట్ ఇన్‌చార్జి ధనమ్మ, ట్రైనర్ బాబా సాహెబ్ పాల్గొన్నారు.


కూరగాయలు అందజేస్తున్న తహసీల్దార్

అభయ శంకరునికి ప్రత్యేక పూజలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట బస్టాండ్ సమీపంలో వున్న అభయ శంకరుని ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రతినిధి ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బాలసదన్‌లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

కోట: స్థానిక బాలసదన్‌లో వున్న ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సూపరింటెండెంట్ దుర్గాదేవి తెలిపారు. ఇక్కడ ఖాళీగావున్న కుక్, నైట్ వాచ్‌మెన్, ఎడ్యుకేటర్, యోగా పోస్టులను అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9553899070లో సంప్రదించాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


తమ గురువులతో పూర్వ విద్యార్థులు

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2012–2013లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. చిన్నతనంలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ప్రస్తుత హెచ్‌ఎం ప్రభావతి, అప్పటి ఉపాధ్యాయులు ఈదూరు వేణుగోపాల్, ప్రసాద్, చంద్రశేఖర్, శివనాగరాజు, మహీపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు

కలువాయి(సైదాపురం): 2025–26 సంవత్సరంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ప్రతాప్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు కలిపి రూ.20 వేలు అందజేస్తాయని వెల్లడించారు. రైతు సేవా సహాయకులు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేస్తారని తెలిపారు.

రేపు మండల సమావేశం

చిట్టమూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

రేషన్ కార్డులకు దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం 14వ వార్డులోని సుదర్శనం నగర్ సచివాలయంలో ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, అడ్రస్ మార్పు తదితరాలు చేస్తున్నట్టు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

సైదాపురం : సైదాపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. సైదాపురంలోని పాత వైద్యశాల భవనం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై పలు వినతులు

దొరవారిసత్రం : తహసీల్దార్ శైలకుమారి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన రైతులు రెవెన్యూ సమస్యలపై వినతులు అందజేశారు. పింఛన్లు, ఇళ్లు, ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో గోవర్ధన, హౌసింగ్ ఏఈ మోహన్‌రావు తెలిపారు. అధికారులు హరికృష్ణ, జ్యోతిర్మయి, మెహతాజ్, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం గౌతమ బుద్ధుడి జయంతిని ఏడీపీఎస్ (అంబేడ్కర్ ధర్మపోరాట సమితి) ఆధ్వర్యంలో జరుపుకున్నారు. బుద్ధుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింగిటి వెంకటయ్య, జిల్లా అధ్యక్షుడు గుండవోలు గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నావూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గంలో నడవాలి

చిల్లకూరు : ప్రతి ఒక్కరూ బుద్ధుడి మార్గంలో నడిచి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని బీఎస్పీ నాయకుడు నాశిన భాస్కర్ గౌడ్ కోరారు. గౌతమ బుద్ధుని జయంతిని సోమవారం గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న విగ్రహం వద్ద జరుపుకున్నారు. అనంతరం గౌతమ బుద్ధుడి సద్భాషణ అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజా సంఘాల నాయకులు ఎల్‌వీ సుబ్బయ్య, గుంటమడు వెంకటేశ్వరరాజు, లతీష్, గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


సుబ్రమణ్యం(ఫైల్)

దొరవారిసత్రం : మండలంలోని మీజూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పనబాక సుబ్రమణ్యం (74) ఆదివారం మృతి చెందారు. స్వగ్రామైన వేలికాడు గ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మీజూరు పంచాయతీ సర్పంచుగా, నీటి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు.

విజయదుర్గ అమ్మవారికి పుష్పాభిషేకం

చిల్లకూరు : గూడూరులోని సాయి సత్సంగ నిలయంలో ఉన్న విజయదుర్గ ఉప పీఠంలో సోమవారం వైశాఖ పౌర్ణమి, శ్రీచక్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి పుష్పాభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం విజయదుర్గా స్తుతి రత్నం ఆడియో క్యాసెట్‌ను విడుదల చేశారు. కోట సునీల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

చిల్లకూరు : మండలంలోని ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హోమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కోట మండల దొరువుకట్టకు చెందిన చిల్లకూరు రవీంద్రరెడ్డి, ఉమారాణి, సాయంత్రం పల్లకీ సేవకు ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వేమారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, అమృతమ్మ, యమదిన్నెపాళెంకు చెందిన ఇనుగుంట శోభన్, శిరీష్ వ్యవహరించారు.